క్లుప్తంగా

పద్మ విభూషణ్ పురస్కార గ్రహీతకు సన్మానం



డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత, ఏఐజీ ఆస్పత్రి అధినేత డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డిని గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి సన్మానించారు. గురువారం హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలసిన వైవీఆర్ ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. వైద్యరంగంలో విశిష్ట సేవలందిస్తూ ఆవిష్కరణలు, పరిశోధనలతో రోగులకు నాణ్యమైన వైద్యాన్ని అందిస్తున్న తెలుగుజాతిరత్నం డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం పద్మవిభూషణ్ పురస్కారంతో సత్కరించడం అభినందనీయమని వైవీఆర్ కొనియాడారు.

ఎంపీటీసీకి ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న కొనుదల రమేష్‌రెడ్డి

తాడిపత్రిటౌన్: టీడీపీ మూకల దాడిలో ఇబ్బందులు పడిన మండలంలోని చుక్కలూరుకు చెందిన దళిత ఎంపీటీసీ ఎర్రగుడి మేరి, ఆమె భర్త భాస్కర్‌కు గురువారం తాడిపత్రి పట్టణంలోని క్రిష్ణాపురంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొనుదల రమేష్‌రెడ్డి ఆయన స్వగృహంలో రూ.50వేలు ఆర్థికసాయం అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక తాడిపత్రిలో అరాచకం రాజ్యమేలుతోందన్నారు. అధికార పార్టీ నాయకులు ఎన్ని ఇబ్బందులు పెట్టినా ధైర్యంగా ఉండాలని, ఎంపీటీసీ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు.

నేడు పొలిటికల్ సమావేశం

శింగనమల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వివిధ రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శేషారెడ్డి గురువారం తెలిపారు. సమావేశంలో ఓటరు నమోదుపై చర్చిస్తామన్నారు. నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి హాజరవుతారన్నారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొనాలని ఆయన కోరారు.

కార్మికుల వినూత్న నిరసన



మోకాళ్లపై నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

గుత్తి: డిమాండ్ల సాధన కోసం మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులు ఐదో రోజు వినూత్నంగా నిరసన తెలిపారు. గురువారం కార్మికులు సీపీఐ, ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి గాంధీ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ సర్కిల్ వద్ద మోకాళ్లతో నిలుచని నిరసన వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ కార్మిక సంఘం అధ్యక్షుడు రాజా, పారిశుధ్య కార్మిక సంఘం అధ్యక్షులు సూరి, రామాంజనేయులు మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, జీఓ 36 ప్రకారం జీతాలు ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘం నాయకులు ఆది, మహేష్, స్వామి పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ

గుత్తి: పట్టణంలోని పలు వార్డు సచివాలయాలను గురువారం మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయాల్లో ప్రజలకు అందుతున్న సేవలు, సిబ్బంది పని తీరుపై ఆరా తీశారు. సమయపాలన పాటించాలని సిబ్బందిని ఆదేశించారు.

నెట్టికంటుడికి గజ వాహనం వితరణ



గజ వాహనానికి సంప్రోక్షణ పూజ నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: బళ్లారికి చెందిన హెచ్ఆర్‌జే రామకృష్ణ అనే భక్తుడు కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి గురువారం ఇత్తడి గజ వాహనాన్ని వితరణ చేశారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయ యాగశాలలో గజ వాహనానికి సంప్రోక్షణ, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం దాతలకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

ఇదేనా అభివృద్ధి!

కూటమి ప్రభుత్వం కొలువయ్యాక రోడ్ల మరమ్మతులు చేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారులు ఛిద్రం కావడంతో ప్రయాణం నరకమవుతోంది. ఇక వర్షం వస్తే పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. గుంతల్లో వర్షపు నీరు నిలుస్తుండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు పర్యవేక్షించి రోడ్లు మరమ్మతులు చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

- అధ్వానంగా గ్రామీణ రహదారులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



కంకర తేలిన తిమ్మాపురానికి వెళ్లే తారురోడ్డు



పుట్లూరు మండలం నారాయణపల్లికి వెళ్లే రోడ్డులో గుంతలు



ప్రమాదకరంగా చాలవేముల గ్రామానికి వెళ్లే తారురోడ్డు

పుట్లూరు: అధికారంలోకి వస్తే అభివృద్ధికి పెద్దపీట వేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఏడాదైనా అధ్వానంగా ఉన్న గ్రామీణ రోడ్ల మరమ్మతులపై దృష్టి పెట్టలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. పుట్లూరు మండలంలోని తిమ్మాపురం, నారాయణపల్లి, చాలవేముల గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. రోడ్లకు ఇప్పటి వరకూ కనీసం తాత్కాలిక మరమ్మతులు చేయలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్ల దుస్థితిపై పలుమార్లు నిరసన తెలిపినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్ల నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



కల్వర్టుపై ప్రమాదకరంగా వెళ్తున్న స్కూల్ బస్సు

యల్లనూరు: యల్లనూరు చెరువు వద్ద కల్వర్టుపై వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. ఈ రోడ్డుపై నిత్యం ప్రైవేట్ స్కూల్ బస్సులు, జీపులు, కార్లు, ఆటోలు తిరుగుతుంటాయి. యల్లనూరు చెరువు నుంచి గడ్డంవారిపల్లి, వెన్నపూసపల్లి వెళ్లే ప్రధాన రహదారిలో చెరువుకట్ట కల్వర్టు ఉంది. ఈ చెరువుకట్ట కల్వర్టు మీదుగా రాకపోకలకు వాహనదారులకు చాలా అవస్థలు పడుతున్నారు. కల్వర్టు చిన్నదిగా ఉండటంతోపాటు ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ఓ ట్రాక్టరు డ్రైవరు కల్వర్టు వద్ద సక్రమంగా నడపలేక వాహనాన్ని చెరువులోకి దూకించాడు. మరో ద్విచక్రవాహనం కూడా ఇలానే కల్వర్టులోకి దూసుకెళ్లింది. ఈ కల్వర్టు వద్ద ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోలేదు. అలాగే కంకర రోడ్డుతో అవస్థలు పడుతున్నామని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కల్వర్టు వద్ద తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

ఏపీఓగా రాజ్యలక్ష్మి



తాడిపత్రిటౌన్: ఉపాధి హామీ మండల ఏపీఓగా రాజ్యలక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో తాడిపత్రి ఏపీడీ కార్యాలయంలో మానిటర్ అధికారిగా విధులు నిర్వహించిన ఆమె బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే విధంగా ఉపాధి హామీ పనులు చేపడతామన్నారు.

ఆర్ఐగా సయ్యద్ హుమేరానాజ్

పెద్దవడుగూరు: పెద్దవడుగూరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గా సయ్యద్ హుమేరానాజ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న లహరిక కలెక్టర్ కార్యాలయానికి బదిలీ వెళ్లగా కలెక్టర్ కార్యాలయం నుంచి ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. మండల ప్రజలకు అందుబాటు లో ఉండి సేవలు అందిస్తామని ఆమె తెలిపారు.

వృద్ధురాలి మృతి



మృతి చెందిన లక్ష్మిదేవి

గుత్తి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు మృతిచెందింది. వివరాలు.. పట్టణంలోని కర్నూల్ రోడ్డులో బిశ్వాస్ క్లినిక్ సమీపంలో బుధవారం రాత్రి ఉప్పర వీధికి చెందిన లక్ష్మిదేవి(65) రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీ కొంది. ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడింది. స్థానికులు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున వృద్ధురాలు మృతి చెందింది. ఘటనపై ఎస్ఐ సురేష్ కేసు దర్యాప్తు చేపట్టారు.

వినాయక ఘాట్ పరిశీలన

గుంతకల్లుటౌన్: పట్టణంలోని మార్కెట్‌యార్డు ఎదురుగా ఉన్న వినాయక ఘాట్‌ను మున్సిపల్ కమిషనర్ నయీమ్, ఎంఈ ఇంతియాజ్, ఏసీపీ శ్రీనివాసులు గురువారం సాయంత్రం పరిశీలించారు. ఆగస్టు నెలలో వినాయక చవితిని పురస్కరించుకుని వినాయక విగ్రహాల ప్రదర్శన, నిమజ్జనం కార్యక్రమాలకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై నగర ఉత్సవ సమితి ప్రతినిధులతో చర్చించారు. టీడీపీ నాయకుడు నారాయణస్వామి, ఏఈ సుదర్శన్, నగర ఉత్సవ సమితి అధ్యక్షుడు బండారు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఎస్.ఎస్.ట్యాంక్‌లో నీటి నిల్వలు, హంద్రీనీవా కెనాల్‌లో జరుగుతున్న పనులతో పాటు నీటి పంపింగ్‌కు వినియోగించే మోటార్లు, తాగునీటిని శుద్ధి చేసే ఫిల్టర్‌బెడ్స్‌ను మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్, ఎంఈ ఇంతియాజ్ పరిశీలించారు.

మస్తానయ్య ఉరుసుకు బందోబస్తు

గుంతకల్లు: హజరత్ మస్తానయ్య ఉరుసు ఉత్సవాలకు భారీ బందోబస్తును ఏర్పాటు చేయనున్నట్లు డీయస్పీ ఆముదాల శ్రీనివాస్ తెలిపారు. గురువారం డీయస్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకూ నిర్వహించే ఉత్సవాలకు కులమతాలకు అతీతంగా వేలాదిగా భక్తులు తరలివస్తారన్నారు. ఈ నేపథ్యంలో తన పర్యవేక్షణలో ఎనిమిది మంది సీఐలు, 20 మంది ఎస్ఐలు, 30 మంది ఏఎస్ఐలు, 170 మంది కానిస్టేబుళ్లు, 50 మంది హోంగార్డులు, 20 మంది మహిళా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఉత్సవాలను ఘనంగా జరుపుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

హామీల అమలులో 'కూటమి' విఫలం



మాట్లాడుతున్న కుల్లాయిస్వామి

గుంతకల్లు: హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి ఆరోపించారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంతురాముడు, కుల్లాయిస్వామి మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేస్తామని, జీవో నం.77ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారం చేపట్టి 15 నెలలు పూర్తి చేసుకున్నా ఇంతవరకు ఫీజురియంబర్స్‌మెంట్ బకాయిలు రూ.6400 కోట్లు అలాగే ఉండిపోయిందన్నారు. అలాగే పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం చేసే జీవో 77ను కూడ రద్దు చేయలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బడుగు, బలహీన వర్గాలు విద్యను అభ్యసిస్తున్న ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకుల కేజీబీవీ హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కారానికి నోచుకోలేదన్నారు. అంతేకాకుండా పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను పెంచడంతో పాటు పెండింగ్‌లో మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయలేదన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుకు పోరాటలకు సిద్ధం కావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు వెంకట్ నాయక్, నరసింహ యాదవ్, వంశీ, మంజు, రమణయ్య, ఉమామహేష్, వినోద్, అఖిల్, రోహిత్, శివమణి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులపై ఎమ్మెల్యే పెత్తనం ఏంటి?



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు

బుక్కరాయసముద్రం: శింగనమల నియోజకవర్గంలోని సచివాలయ ఉద్యోగుల బాధ్యతల విషయంలో స్థానిక ప్రజా ప్రతినిధులు పెత్తనం ఏమిటని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు మండిపడ్డారు. గురువారం మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల అధ్యక్షులు విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడుతూ, ఏదో ఒక సాకుతో జైళ్లకు పంపుతున్నారన్నారు. అదేవిధంగా శింగనమల నియోజకవర్గంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి సైతం రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారన్నారు. ఇటీవల బదిలీల్లో సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో ఎమ్మెల్యే పెత్తనం ఏంటని ప్రశ్నించారు. సచివాలయ ఉద్యోగులను ఎమ్మెల్యే ఇంటి వద్ద పడిగాపులు ఉండేలా వ్యవహరించడం దారుణమన్నారు. నియోజక వర్గంలో అంబేడ్కర్ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ బీకేఎస్, శింగనమల, గార్లదిన్నె, పుట్లూరు, నార్పల మండల అధ్యక్షులు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, పూల ప్రసాద్, ఎల్లారెడ్డి, పుట్లూరు మహేశ్వరరెడ్డి, నార్పల ఖాదర్‌వలి, జెడ్పీటీసీ భాస్కర్, అంకే నరేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చిన్న మొహర్రం



గుత్తి ఓల్డ్ సీపీఐ కాలనీలో పీర్లను జలధికి తరలిస్తున్న దృశ్యం



క్రిష్టిపాడులో పెద్దగరిడి పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

గుత్తి/పామిడి: గుత్తి పట్టణంలో గురువారం చిన్న మోహరం(చిన్న పీర్ల పండుగు) వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఓల్డ్ సీపీఐ కాలనీ, కుమ్మర వీధి, ఉప్పర వీధి తదితర ప్రాంతాల్లో పీర్లను జలధికి తరలించారు. శనివారం జార్తళ్లు నిర్వహిస్తారు. జార్తళ్లతో పీర్ల పండుగ వేడుకలు ముగుస్తాయి. అలాగే పామిడిలో పది రోజులుగా నిర్వహిస్తున్న చిన్న మొహర్రం వేడుకలు గురువారం ముగిశాయి. చివరిరోజు ఉదయాన్నే పీర్ల స్వాములు అగ్ని ప్రవేశం చేశాయి. అగ్నిగుండ ప్రవేశ అనంతరం పీర్లస్వాములు నగర ప్రదర్శన గావించారు. సాయంత్రం పీర్లను జలధికి తరలించారు.

పెద్ద గరిడి పీర్ల ఊరేగింపు

పెద్దవడుగూరు: మండలంలోని క్రిష్టిపాడులో గురువారం పెద్ద గరిడి పీర్ల స్వాముల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. భక్తులు చక్కెర చదివింపులు నిర్వహించి మొక్కులు తీర్చుకొన్నారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



పామిడిలో చిన్న మౌలాలి పీర్లస్వాముల దృశ్యం

దళితులపై దాడులు ఆపాలి



మాట్లాడుతున్న సీపీఐ న్యూ డెమొక్రసీ పార్టీ నాయకులు

గార్లదిన్నె: రాష్ట్రంలో దళితులు, మహిళలపై జరుగుతున్న దాడులను వెంటనే ఆపాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం గార్లదిన్నెలో సీపీఐ న్యూ డెమొక్రసీ పార్టీ ఆధ్వర్యంలో కారంచేడు, చుండూరు నరమేధం జరిగి 40 ఏళ్లు పూర్తైన సందర్భంగా సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ 1985, జూలై 17న కారంచేడులో దళితులపై నరమేధం చేశారన్నారు. అలాగే 1991, ఆగష్టు 6న చుండూరులో పోలీసుల సహకారంతో ఆరుగురిని చంపారన్నారు. అప్పట్లో దళిత సంఘాలు, ప్రజా సంఘాలు దళితులకు సపోర్టుగా నిలిచి, నిందితులకు శిక్ష పడేలా చేశాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ న్యూడెమొక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి నాగరాజు, సహాయ కార్యదర్శి క్రిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే పాయింట్స్‌మెన్‌కు సన్మానం



హరిష్‌కు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న డీఆర్‌ఎం సీఎస్ గుప్తా

గుంతకల్లు: డివిజన్ పరిధిలోని తిరుపతి రైల్వేస్టేషన్ ఔటర్‌లో ఈ నెల 14న రైలు భోగీల్లో మంటలు వ్యాపించిన ఘటనలో పాయింట్స్‌మెన్ హరిష్ అప్రమత్తత కారణంగా విలువైన రైల్వే ఆస్తులను కాపాడామని డీఆర్‌ఎం చంద్రశేఖర్‌గుప్తా హర్షం వ్యక్తం చేశారు. గురువారం పాయింట్స్‌మెన్ హరీష్‌ను డీఆర్‌ఎం చాంబర్‌కు పిలుపించుకొని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రత్యేక మెడల్‌తోపాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. సీనియర్ డీఓఎం డాక్టర్ ఎం.శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకు భక్తుల పాదయాత్ర



పామిడి నుంచి తిరుమలకు పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

పామిడి: పట్టణంలోని పెద్ద విఠోబదేవాలయం నుంచి గురువారం తిరుమల పాదయాత్ర బృందం, పామిడి భావసార క్షత్రియ భజన మండలి బృందం సంయుక్త ఆధ్వర్యంలో పాదయాత్ర బృందం ఆరోసారి బయలుదేరింది. ముందుగా పెద్ద విఠోబ దేవాలయంలో గణపతి హోమంతో పాటు రుక్మిణీ పాండురంగస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ నుంచి భావసార క్షత్రియ భజన మండలి సంకీర్తనాలాపనల నడుమ 200 మందితో కూడిన భక్తుల పాదయాత్ర కొనసాగింది. జే శ్రీనివాసరావు, గోందో రాజశేఖర్ రావు, కే వేణుగోపాల్‌రావు, కే వెంకటేశ్వరరావు, రవీంద్ర, ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పుట్లూరు: మండలంలోని సూరేపల్లి, పుట్లూరు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను గురువారం తహసీల్దార్ శేషారెడ్డి పరిశీలించారు. 1,200 ఓట్లు కంటే ఎక్కువ ఉన్న పోలింగ్ బూత్‌లను విభజించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ రెండు గ్రామాల్లో అదనపు పోలింగ్ బూత్ ఏర్పాటు కోసం గదులను పరిశీలించామన్నారు. వీఆర్‌ఓ వెంకటనారాయణ, రికార్డు అసిస్టెంట్ ప్రసాద్, వీఆర్ఏలు ఉన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతి

తాడిపత్రిటౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గురువారం ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సభ్యులు నగదు బహుమతులు అందజేశారు. 507 మార్కులు సాధించిన హసీనాకు రూ.5 వేలు, 481మార్కులు సాధించిన ఆసీఫ్‌కు రూ.3 వేలు, 464 మార్కులు సాధించిన ఆయోషాకు రూ.2 వేలు నగదు అందజేశారు. హెచ్ఎం శైలజ, సంఘం ప్రెసిడెంట్ సత్యప్రసాద్‌రెడ్డి, ఆదినారాయణ స్వామి, వీరారెడ్డి పాల్గొన్నారు.

నాలుగో రోజుకు చేరిన సేవ్ ఆర్డీటీ దీక్షలు

పామిడి: పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ పునరుద్దరణ కోసం ఐక్య మాదిగ సమాజ్ ఆధ్వర్యంలో చేపట్టిన వంద గంటల రిలే నిరాహార దీక్షలు గురువారం నాలుగో రోజుకు చేరాయి. ఆ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వంకరాజుకాలువ వెంకటేష్‌తో పాటు నాగశేఖర్, రహంతుల్లా, ఓబుళపతి, కేశవ్, సూర్యప్రకాష్‌రెడ్డి, గంగమ్మ, లక్ష్మమ్మ, నాగమ్మ, లక్ష్మిదేవి రిలే దీక్షలో కూర్చొన్నారు.

సంక్షిప్త సమాచారం

టిప్పర్‌ను ఢీ కొన్న కంటైనర్ లారీ

గుత్తి: పట్టణంలోని ఆర్ఎస్ రోడ్డులో ఉన్న ఎల్‌సీ-4 రైల్వే బ్రిడ్జి వద్ద గురువారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. కంటైనర్ లారీ వెనుక నుంచి టిప్పర్‌ను ఢీ కొంది. ఘటనలో టిప్పర్ ముందు భాగం దెబ్బతినగా డ్రైవర్ త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

తహసీల్దార్‌కు సన్మానం

పామిడి: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం పామిడి లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఆయూష్ సీనియర్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతినాయడు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు నూతన తహసీల్దార్ షర్మిలను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు తహసీల్దార్‌తో పాటు డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ, రీసర్వే డీటీ సురేఖకు పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ కమిటీ అధ్యక్షుడు కే రఘువీర్ రావు, కార్యదర్శి పీ శ్రీనివాసులు, కోశాధికారి డీ షెక్షావలి, డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్లు డాక్టర్ మురళీ కృష్ణ, పీసే జయరామరావు పాల్గొన్నారు.

దుకాణాలపై దాడులు

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని పలు దుకాణాల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో హెల్త్ అసిస్టెంట్లు, సిబ్బంది గురువారం విస్తృతంగా దాడులు నిర్వహించారు.ఈ దాడుల్లో నిషేధిత ప్లాస్టిక్ కవర్లు సుమారు 14 కిలోలు స్వాధీనం చేసుకున్నారు. అంతే కాకుండా ప్లాస్టిక్ విక్రయిస్తున్న దుకాణం యజమానుల నుంచి రూ. 1,700 జరిమానా వసూలు చేశారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తే జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

చెత్త ఎత్తిన కమిషనర్

తాడిపత్రి రూరల్: పట్టణంలోని టైలర్స్ కాలనీలో గురువారం మునిసిపల్ కమిషనర్ స్వయంగా చెత్తను ఎత్తి చెత్త సేకరణ వాహనంలో వేశారు. చెత్త సేకరణకు సంబంధించిన కాంట్రాక్టు కార్మికులు సమ్మెలో ఉండటంతో ప్రజలకు ఇబ్బంది కలుగకుండా కమిషనర్ రంగంలోకి దిగారు. చెత్త సేకరణ వాహనం వెంట వైస్ చైర్మన్ షెక్షావలి, కౌన్సిలర్లతో కలసి వెళ్లిన కమిషనర్ చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించారు. సమ్మె వల్ల సిబ్బంది కొరత ఉందని, ప్రత్యేక ఏర్పాట్లల్లో భాగంగా తాము స్వయంగా వాహనాల వెంట వచ్చి చెత్తను సేకరిస్తున్నామన్నారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయరాదని, ఇళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. అండర్ డ్రైనేజీ సమస్యలు, నీటి ఎద్దడి, వీధిలైట్ల సమస్యలను వార్డు సచివాలయాల్లో ఫిర్యాదు చేసిన వెంటనే పరిష్కరిస్తామన్నారు.

బీఎల్‌ఓలకు ముగిసిన శిక్షణ

గుంతకల్లు రూరల్: స్థానిక శంకరానంద గిరీ డిగ్రీ కళాశాలలో గత ఆరు రోజులుగా కొనసాగుతున్న బీఎల్‌ఓల శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రైనర్ నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో రోజుకు 46 మంది చొప్పున ఆరు రోజుల పాటు 276 మంది బీఎల్‌ఓలకు శిక్షణ ఇవ్వడంతో పాటు, పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో ఉత్తీర్ణులైన 276 మంది బీఎల్‌ఓలకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ రమాదేవి మాట్లాడుతూ ఆరు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులను బీఎల్‌ఓలు విజయవంతంగా పూర్తి చేశారన్నారు. అనంతరం బీఎల్‌ఓలకు శిక్షణ ఇచ్చిన అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రైనర్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నారాయణ స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి మృతి

గార్లదిన్నె: మండలంలోని ఇల్లూరులో రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్‌బాషా తెలిపారు. గురువారం ఎస్ఐ మాట్లాడుతూ ఎగువపల్లికి చెందిన రామక్రిష్ణ(64) బుధవారం రాత్రి ద్విచక్రవాహనంలో ఇల్లూరుకు వెళ్లి అక్కడ పని ముగించుకుని ఇంటికి వెళ్తుండగా జిల్లా పరిషత్ హైస్కూల్ సమీపంలో రాగానే టిప్పర్‌ను ఢీ కొనడంతో రామక్రిష్ణ గాయపడ్డాడు. వెంటనే స్థానికులు అతడిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. అతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులకు మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలి

తాడిపత్రిటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వారు ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 300 మంది విద్యనభ్యసిస్తున్న కళాశాలలో మరుగుదొడ్లు లేక పోవడం దారుణమన్నారు. అలాగే విద్యారులకు డైనింగ్ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. పట్టణ అధ్యక్షుడిగా రాజు, కార్యదర్శిగా వరుణ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా గంగాధర్, సభ్యులుగా సమీరారెడ్డి, శిరీష, హరీష్ నాయక్, శివకృష్ణ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్ తదితరులు పాల్గొన్నారు.